క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

గంగాధరనెల్లూరు: మండలంలోని పెద్దకాల్వ గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణ చంద్రారెడ్డి తెలిపారు. ఉదయం ఏడుగంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ.. సమస్యలను డిప్యూటీ సీఎం తెలుసుకుంటారని పేర్కొన్నారు. పార్టీశ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

వైద్య శిబిరానికి స్పందన

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి పరీక్షలు, కాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు. అలర్జీ, శ్వాస కోశ వ్యాధులు, మూత్రాశయ సంబంధింత వ్యాధులకు పరీక్షించి సూచనలు అందజేశారు.

బాలింతలకు కోడి గుడ్లు పంపిణీ



వెదురుకుప్పం: మండలంలోని అగ్గిచేనుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం బాలింతలకు కోడి గుడ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రబాబు వితరణగా అందించిన కోడిగుడ్లను టీచర్ ప్రేమలత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పరిధిలోని బాలింతలకు అందజేశారు. ఏఎన్‌ఎం ప్రభావతి, అంగన్‌వాడీ హెల్పర్ శిల్ప పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రామజన్మభూమి మహంత్



ఆలయంలో మహంత్ కమల్ నయన్‌దాస్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం అయోధ్య శ్రీరామ జన్మభూమి ట్రస్టు ఉపాధ్యక్షులు మహంత్ కమల్ నయన్‌దాస్ జీ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం



నింద్ర: మండల కేంద్రంలోని తాగునీటి మోటార్ల మరమ్మతులు చేయించి నీటి సరఫరాను ఆదివారం పునరుద్ధరించారు. మూడు మోటార్లు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. సర్పంచ్ వసంతబాబురెడ్డి స్పందించి దగ్గరుండి మోటార్లను మరమ్మతులు చేయించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వినాయకునికి రూ.6లక్షల విరాళాలు



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి భక్తులు రూ.6లక్షలు విరాళంగా ఆదివారం అందించారు. ఉదయం స్వామివారి నిత్యాన్నదానానికి ఐరాల మండలం చినకాంపల్లెకు చెందిన బాలకృష్ణారెడ్డి పేరున ఆయన కుమారులు సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి రూ.5లక్షలు, అలాగే కర్నూలుకు చెందిన విరాళదాత సుబ్బకృష్ణ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశుకు అందించారు. దాత కుటుంబసభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించారు.

జమున వ్యక్తిత్వం అందరికీ ఆదర్శం

తిరుపతి కల్చరల్: సమాజ చైతన్యానికి సినిమా అత్యుత్తమమైన సాధనమని, ఉత్తమ నటిగా రాణించిన జమున వ్యక్తిత్వం సినిమా రంగానికి ఆదర్శం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి తెలిపారు. ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సీపీఐ కార్యాలయంలో సినీ నటి జమున చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నిర్మాణ దశలో షాపింగ్ కాంప్లెక్స్



ఈశ్వరాలయంలో ఫ్లోరింగ్ పనులు

ముమ్మరంగా ఆలయ అభివృద్ధి పనులు

- రూ.30 లక్షలతో ఈశ్వరాలయం పుష్కరిణి పునర్నిర్మాణం
- రూ.63 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- రూ.9 లక్షలతో ఆరేటమ్మ ఆలయం వద్ద ఆర్చి పనులు



ఆరేటమ్మ ఆలయం వద్ద ఆర్చి నిర్మాణం



పుత్తూరులో నిర్మిస్తున్న పుష్కరిణి

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలో ఆలయాల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కార్వేటినగరం రోడ్డులోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ పుష్కరిణి ఆధునీకరణ పనులు ఊపందుకున్నాయి. పట్టణ నడిబొడ్డులోని పుష్కరిణిని గత పాలకులు పూడ్చి వేశారు. ఇది ఊరికి మంచిది కాదని పట్టణంలోని పెద్దలు పలువురు మంత్రి ఆర్కే రోజా దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె పుష్కరిణి ఆధునీకరణకు నడుంబిగించారు. దేవదాయ శాఖ ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేయించారు. రూ.5 లక్షల విరాళాలను పలువురు దాతల నుంచి ఆలయ కమిటీ సభ్యులు సేకరించారు. ఈ నిధులతో పుష్కరిణి నిర్మాణ పనులను మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. పుష్కరిణిని ఆధునికీకరించడంతో పాటు చుట్టూ గార్డెన్, ఒక స్టేజీను ఏర్పాటు చేయనున్నారు. పుష్కరిణి ప్రారంభం అయిన తర్వాత ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గతంలో కోనేరు చుట్టూ చిన్న చిన్న గదుల్లో పలువురు వ్యాపారాలు నిర్వహించుకునేవారు. జీవనాధారం పోయిన వారి కోసం మరో రూ.60 లక్షల అంచనా వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం సైతం జరుగుతోంది. మొత్తం 21 గదులు నిర్మిస్తున్నారు. దీంతో పలువురికి జీవనోపాధికి మార్గం సుగమం అయ్యింది. ఈశ్వరాలయం ఆలయ ప్రాంగణం మొత్తం ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. ఈపనులకు రూ.6 లక్షలను విరాళంగా ఆడిటర్ పి.గజేంద్ర శెట్టి, కె.సోమశేఖర్‌రెడ్డి మిత్ర బృందం అందజేసింది. దేవస్థానం చైర్మన్ కె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. మహాశివరాత్రికి అన్ని పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని పనులు పూర్తయితే పట్టణ నడిబొడ్డులో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోవడం తథ్యం.

ఆరేటమ్మ ఆలయం వద్ద ఆర్చి నిర్మాణం

గ్రామ దేవత ఆరేటమ్మ ఆలయం ముఖ ద్వారం వద్ద రూ.9 లక్షల అంచనా వ్యయంతో ఆర్చి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ముఖ ద్వారం పనులను సైతం మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. ఈ నిర్మాణ పనులకు దాతలు సిద్దూ గిరిబాబు, సిద్దూ మోహన్‌బాబు, పి.జయచంద్రారెడ్డి, ఎం.పురుషోత్తం, కె.చలపతితో పాటు మరి కొందరు ఇచ్చిన విరాళాల ద్వారా పనులు జరుగుతున్నాయి. ఆర్చి నిర్మాణ పనులు ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.





ఇదివరలో ఉన్న ఆలయాన్ని తొలగించి చదునుచేసిన ప్రాంతం, నిర్మాణాలకు సిద్ధమైన మెటీరియల్

నగరి దేశమ్మ ఆలయంలో..

నగరి: పట్టణంలో ప్రముఖ నేత్రప్రదాత శ్రీదేశమ్మ దేవాలయ పునర్నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. బాలాలయం నిర్మించిన తర్వాత ఇదివరలో ఉన్న ఆలయాన్ని తొలగించి పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. భక్తిభావం ఉట్టిపడేలా ఆలయాన్ని పునర్నిర్మించనున్నారు. తెల్లబండలు, రాళ్లు ఆలయ ప్రాకారంలోకి చేరుకున్నాయి. ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి ఆర్కేరోజా సహకారంతో రూ.కోటి నిధులు మంజూరైన సంగతి విదితమే. ఇందులో భాగంగా దేశమ్మ దేవత శక్తిని ఉత్సవ విగ్రహానికి ఇచ్చి ఆలయ సమీపంలోని బాలాలయంలో ఉంచి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈవో మునిశేఖర్ రెడ్డి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి అయిన అనంతరం కుంభాభిషేకం చేయనున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

పాలసముద్రం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలని షెడ్యూల్డ్ కులాల జిల్లా అధ్యక్షుడు ఆర్.తనిగైవేల్ పిలుపునిచ్చారు. ఆదివారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తనిగైవేల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ యువజన సంఘం సమావేశం జరిగింది. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దళిత జాతుల వారు విద్యలో రాణించాలని తెలిపారు. చదువుతోనే ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. అంటరానితనంపై పోరాటం చేయాలన్నారు. అనంతరం యువజన సంఘం పాలసముద్రం మండల కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్.రీగన్, సెక్రటరీగా ఆర్.కుమరేషన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.అవినాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి



జెడ్పీ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్

వెదురుకుప్పం: మండల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులును జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ కోరారు. ఆదివారం జెడ్పీ కార్యాలయంలో చైర్మన్‌ను మండల నాయకులతో కలసి ఆయన కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో రోడ్ల అభివృద్ధి, సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్త కుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రత్యేక నిధులు కేటా యించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైన మేరకు నిధులు కేటాయించేందుకు చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు సుకుమార్ చెప్పారు.

నేడు మామిడి సస్యరక్షణపై సదస్సు

పుత్తూరు రూరల్: పుత్తూరు టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం మామిడి పంట సస్యరక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా ఫెర్టిలైజర్స్ ఆఫీసర్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పిక్ అండ్ గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైయ్యే సదస్సులో ఉద్యానవన శాస్త్రవేత్త పీఎస్.సుధాకర్ సాగులో మెలకువలు తెలియజేస్తారని,తిరుపతి జిల్లా హార్టీకల్చర్ ఆఫీసర్ దశరథరామిరెడ్డి, పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజు యాజమాన్య పద్ధతులు తెలియజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పుత్తూరు పరిసర ప్రాంతాల మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి: పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోమవారం విజయపురం మండల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. కేవీపురం, హరిజవాడ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని, సమస్యలను తెలుసుకుంటారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నింద్రలో కంటి వైద్య శిబిరం

నింద్ర: మండల కేంద్రంలో ఆదివారం బాల సుబ్రమణ్యం నాయుడు ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చెన్నై శంకర్ నేత్రాలయ వారు 21 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 9మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరికి చెన్నైలోని శంకర నేత్రాలయాలో ఉచితంగా ఆపరేషన్ నిర్వహించి, అద్దాలు అందజేయనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో అరెస్టు



నాగరాజు(ఫైల్)

పళ్లిపట్టు: తమిళనాడులో చైన్ స్నాచింగ్ కేసులో కార్వేటినగరం మండలానికి చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పళ్లిపట్టు మండలం వెలిగరం గ్రామానికి చెందిన చెల్లమ్మ(60) స్థానికంగా ఉండే రోడ్డులో గత నెల 31వ తేదీన నడిచి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 8 సవర్ల చైన్‌ను లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పళ్లిపట్టు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈక్రమంలో ఆదివారం షోళింగర్ రోడ్డు మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటువైపు బైకులో వెళ్లిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నిందితుడు తరచూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు తేలింది. నిందితుడు చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం మిట్టకండ్రిగ గ్రామానికి చెందిన నాగరాజు(27)గా తేలింది.

దళిత గ్రామాల్లో ఆలయాల నిర్మాణం



ఎనమలమంద వినాయక ఆలయాన్ని సందర్శిస్తున్న అధికారులు, నాయకులు

వెదురుకుప్పం: దళిత గ్రామాలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామసాని పద్మనాభరెడ్డి తెలిపారు. మండలంలోని ఆలయాలను అభివృద్ధి చేయాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దేవాదాయ శాఖ ను కోరడంతో, ఆదివారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమన్‌ప్రియ, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ గ్రామాలను సందర్శించి అభివృద్ధి చేయాల్సన ఆలయాలను గుర్తించారు. ఈ సందర్భంగా పద్మనాభరెడ్డి మా ట్లాడుతూ మండలంలోని బలిజ మొండివెంగనపల్లెలో కొత్త గుడి నిర్మాణం చేపట్టేందుకు టీటీడీకి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. దళిత గ్రామాల్లో కొత్తగా ఆలయాల నిర్మాణం కోసం రూ.15 లక్షలు మంజూరు కానుందని తెలిపారు. ధూపదీప నైవేద్యం కింద బండమీద ఇండ్లలో సీతమ్మ, చవటగుంటలో నందీశ్వర స్వామి, లక్ష్మీనరసింహస్వామి, ఎనమలమంద గ్రామంలో రెండు ఆలయాలు, ఆళ్లమడుగు దళితవాడలో తురకానమ్మ, దిగువపల్లాలు గ్రామంలో మునీశ్వరస్వామి, శ్రీకృష్ణ ఆలయం, నాగార్జున కాలనీలో అయ్యప్ప స్వామి, వినాయక స్వామి, బుచ్చిరెడ్డికండ్రిగలో శ్రీకృష్ణ, బొమ్మయ్యపల్లెలో వినాయక స్వామి, దేవళంపేటలో ఆంజనేయస్వామి, దేవరగుడిపల్లెలో వేణుగోపాల స్వామి, ఇనాంకొత్తూరు గ్రామంలో ముత్యాలమ్మ ఆలయాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో ఆలయాలను గుర్తించి వాటి అభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు దేవాదాయ శాఖకు ప్రతిపాదనలు పంపుతామని పేర్కొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయంలో ఎమ్మెల్యే సత్యప్రభాకర్



ఆలయ ధ్వజస్తంభం వద్ద మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతుల భాస్కరరావు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సత్య ప్రభాకర్‌రావు, తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆశీర్వదించారు. శ్రీస్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు సతీష్ మాలిక్, శ్రీనాథ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ మోడల్ టెస్ట్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కార్వేటినగరం: ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షలను నిర్వహించారు. పరీక్ష నిర్వాహకుడు జయానందా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ మంజూరు కోసం ఫిబ్రవరి 5వ తేదీన నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షపై 8వ తరగతి విద్యార్థులకు అవగాహన కోసం స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లం ఉన్నత పాఠశాల, పాలసముద్రం మండలంలోని ఎస్ఆర్ కండ్రిగ ఉన్నత పాఠశాల, కార్వేటినగరంలోని ఆర్కేఎస్సార్, బాలికల ఉన్నత పాఠశాల, ఆర్కేవీబీపేట, డీఎం పురం, పాదిరికుప్పం ఉన్నత పాఠశాలలతో పాటు డైట్ ఆదర్శ యూపీ పాఠశాలలకు చెందిన 93 మంది విద్యార్థులు సామర్థ్యాలను పరిశీలించుకునేందుకు పరీక్ష రాసినట్లు తెలిపారు. ఇన్విజిలేటర్లుగా పీ. మాధవరెడ్డి, పీ.జగదీష్, కె.వేమయ్య, కె.ఈశ్వరి, పూర్ణిమ వ్యవహరించారు.

హోరా హోరీగా క్రికెట్ మ్యాచ్



విజేతలైన టీం సభ్యులతో నిర్వాహకులు

నగరి : స్థానిక కేవీకే మైదానంలో మంత్రి ఆర్కేరోజా సహకారంతో నిర్వహించిన చెన్నై చక్రా అకాడమీ క్రికెట్ మ్యాచ్‌లు హోరా హోరీగా జరిగాయి. అండర్-10, అండర్-12, అండర్ -14 విభాగాలకు విడివిడిగా నగరి టీం వారు చెన్నై చక్రా క్రికెట్ అకాడమీ టీంతో పోటీపడ్డారు. ఈ పోటీల్లో అండర్ 10, 14 విభాగంలో నగరి టీం విజేత కాగా, అండర్ 12 విభాగంలో చెన్నై టీం విజేతగా నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కేవీకే కోచ్ బాబు పోటీల నిర్వహణ బాధ్యతలను నిర్వహించారు. విజేతలకు మంత్రి ఆర్కేరోజా అభినందనలు తెలిపారు. అలాగే మహిళల అండర్-19 టీ-20 వరల్డ్ కప్ సాధించి చరిత్ర సృష్టించిన టీం ఇండియా క్రీడాకారులకు ప్రశంసల వర్షం కురిపించారు.

ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలి

తిరుపతి అర్బన్: ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు టికెట్‌కు సరిపడా చిల్లర ఇవ్వడం లేదని కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, రిక్వెస్ట్ స్టాపింగ్‌లో డ్రైవర్లు బస్సులను నిలపడంలేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులకు సహకరించాలని ఇదివరకే ఆదేశాలు జారీ చేసినా కొందరు పెడచెవిన పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఆర్టీసీపై గౌరవం పెరిగేలా ఉద్యోగులు నడుచుకోవాలని హితవుపలికారు. తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రయాణికులు కూడా టికెట్‌కు సరిపడా చిల్లర తెచ్చుకోవాలని కోరారు.

రబీ సాగుకు రైతుల సన్నద్ధం



వెంగళరాజుకుప్పంలో నాట్లు వేస్తున్న కూలీలు



చెరుకు సాగులో సాలు దున్నుతున్న రైతులు

పాలసముద్రం: మండలంలో రబీ పంటల సాగు ప్రారంభమైంది. బోర్లు, బావుల్లో భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో రబీ సాగు పనులను రైతులు ప్రారంభించారు. వెంగళరాజుకుప్పం, సింహరాజుపురం, శ్రీకావేరిరాజుపురం, అముదాల పంచాయతీల పరిధిలో నాట్లు వేసేందుకు దుక్కులు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నాట్లు నాటుతున్నారు. నెలకిందట చెరుకు నాటిన రైతులు ఇప్పుడు మందులు వేసి కోడెద్దులతో సాలు దున్నుతున్నారు. రబీ పంటగా రాగులు, వరి సాగు చేస్తున్నారు. రైతులు రబీలో వరితో పాటు రాగులు, మిరప పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయాధికారులు కూడా ఈ సీజన్‌లో వరి, మిరప, టమాట సాగు చేయాలని సూచిస్తున్నారు.

సాగు విస్తీర్ణం పెరగ వచ్చు



వర్షాలు బాగా కురిసి భూగర్భ జలాలు బాగున్నాయి. సాగునీటికి డోకా లేకపోవడంతో ఈ రబీ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం పెరగవచ్చు. మార్చి వరకు వేరుశనగ, రాగి, వరి, టమాట, మిరప, అనప, సజ్జ పంటలను సాగు చేసుకోవచ్చు. మండలంలో రబీ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1,550 హెక్టార్లు.

–డిల్లీప్రసాద్, మండల వ్యవసాయాధికారి